క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో ఇరుముడులు కార్యక్రమం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని అయ్యప్పనగర్‌లో వేంచేసియున్న శ్రీధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో ఆదివారం అయ్యప్పదీక్షా స్వాముల ఇరుముడులు కార్యక్రమం జరిగింది. తొలుత స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. 41రోజుల అయ్యప్పస్వామి దీక్ష పాటిస్తున్న మాలధారులు ఆలయ అర్చకులు మురళి స్వామి ఆధ్వర్యంలో ఇరుముడులు కట్టించుకున్నారు. అనంతరం స్వామివారికి పూజలు చేశారు. అనంతరం అయ్యప్ప మాలధారులు శబరిమలకు తరలివెళ్లారు.

నేటి నుంచి ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన

కంచికచర్ల : మండలంలోని అన్ని గ్రామాల్లో ఈనెల 18 నుంచి 2024 జనవరి 6వ తేదీ వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో లొకేషన్ ట్రైనింగ్ పర్సన్‌తో మొబైల్ డిమోన్‌స్ట్రేషన్ వ్యాన్ ద్వారా ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించనున్నట్లు తహశీల్దార్ పబ్బూరి శంకర బాబు ఆదివారం తెలిపారు. ఈవీఎంలపై అవగాహన కల్పించేందుకు ఆయా గ్రామాల్లోని అన్ని రాజకీయపార్టీల నాయకులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, బూత్ లెవెల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొంటారని వివరించారు. ఈవీఎంల పని తీరుపై ప్రతి ఓటరు అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ సూచించారు.

నేడు స్పందన కార్యక్రమం

కంచికచర్ల : ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహశీల్దార్ పి.శంకరబాబు తెలిపారు. ఉదయం పదిగంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిష్కరిస్తామని చెప్పారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కంచికచర్ల : విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కంచికచర్లలో ఆదివారం చోటుచేసుకుంది. ఏఎస్ఐ మోహనరావు కథనం మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భీమ్‌రాం(32) స్థానిక చెవిటికల్లు రోడ్డు అండర్‌పాస్ రోడ్డు వద్ద శనివారం ఉదయం ఫైబర్ నెట్ వైర్‌ను విద్యుత్ స్తంభానికి కట్టే సమయంలో విద్యుత్ వైర్లు తగిలి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన తోటి కార్మికులు అతన్ని వైద్యచికిత్స కోసం స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు, సంతానం ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవాల ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పుట్టవీధిలోని స్వయంభూ శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి కార్యక్రమానికి ఆలయ ధర్మకర్తల కుటుంబ సభ్యుడు బోయిన పాండురంగరావు జానకి దంపతులు గణపతి పూజతో అంకురార్పణ చేశారు. అనంతరం స్వామివారికి కావడి ఉత్సవం నిర్వహించారు. కావడి ఉత్సవంలో 108 మంది భక్తులతో పాటు చిన్నారులు సైతం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కావడి చేతబూని నృత్యాలు చేస్తూ మేళతాళాలతో పురవీధుల్లో ఉత్సవం నిర్వహించారు. శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకుడు రంగావఝల ప్రసాద్‌శర్మ ఆధ్వర్యాన పంచామృత అభిషేకాలు జరిగాయి. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రామాలయానికి చేరిన అక్షింతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామ జన్మభూమి అయోధ్య రామ పూజిత పవిత్ర అక్షింతలు స్పర్శ కార్యక్రమంలో భాగంగా వీహెచ్‌పీ ఆధ్వర్యాన రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పంపించే అక్షింతలు దేవీనగర్ శ్రీ కోదండ రామాలయానికి ఆదివారం చేరుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అక్షింతలు స్వీకరించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి దేవీనగర్‌లోని ప్రతి ఇంటికీ తిరిగి అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవ ఆహ్వాన పత్రిక శ్రీరాముని అక్షింతలు అందించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు గంగిశెట్టి సాంబ శివరావు తెలిపారు.







జననీరాజనం



వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మంత్రి మేరుగ నాగార్జున, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు



బహిరంగసభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం

- సామాజిక సాధికార బస్సుయాత్రకు వేలాదిగా తరలి వచ్చిన ప్రజలు
- నూతనోత్సాహంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు



నందిగామ టౌన్: సామాజిక సాధికార బస్సుయాత్రతో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నందిగామలో మరోసారి మోత మోగించింది. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగసభకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వేలాదిగా తరలివచ్చి నీరాజనం పలికారు. ద్విచక్ర వాహన ర్యాలీలు, డప్పు కళాకారుల విన్యాసాలు, జానపద కళాకారుల పాటలు, నృత్యాలు, డీజే సౌండ్స్‌తో నందిగామలో రాజకీయసందడి ఆకాశన్నంటింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారీ, అగ్రవర్ణ పేదల కోసం అందించిన సంక్షేమపథకాల ద్వారా లబ్ధిపొందిన వేలాది మంది సామాజిక సాధికార యాత్రకు పోటెత్తారు. బస్సు యాత్ర ప్రారంభమైన వై జంక్షన్ నుంచి సీఎం రోడ్డు, రైతు బజార్ ప్రాంతాలతో పాటు పట్టణంలోని పలు ప్రధాన కూడళ్ల పార్టీ పతాకాలు, సామాజిక సాధికార బస్సు యాత్ర ఫ్లెక్సీలతో కళకళలాడింది. వేలాది మంది పార్టీ నాయకులు, కార్యకర్తల కేరింతలు, జై జగన్ నినాదాలతో బస్సుయాత్ర ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వేలసంఖ్యలో ప్రజలు పట్టణానికి రావడంతో టీడీపీ వర్గాలు సైతం నిర్ఘాంతపోగా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓటుబ్యాంకు మరింత పెరిగిందనేందుకు సాధికార బస్సు యాత్ర విజయవంతం కావడమే రుజువని వైఎస్సార్ సీపీ శ్రేణులు ఉత్సాహంగా ఉన్నాయి. జనసంద్రంగా మారిన నందిగామను చూసి రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే హవా అనే చర్చ రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది.

అన్నివర్గాల సాధికారతే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు జూపూడి, పక్కన ఎమ్మెల్సీ అరుణకుమార్, ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలకు సంక్షేమఫలాలు అందిస్తూ వారు సాధికారత సాధించేలా చూడటమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక సాధికార బస్సుయాత్ర, బహిరంగ సభ ఆదివారం నందిగామ గాంధీ సెంటరులో జరిగింది. బహిరంగ సభలో ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలుచేయని చరిత్ర చంద్రబాబుది కాగా, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99.5 శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంతమని అన్నారు. ఎస్సీ రిజర్వుడు స్థానమైన నందిగామ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధే నిజమైన సామాజిక సాధికారతకు నిదర్శనమని చెప్పారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిందేమిటో.. చేసిందేమిటో ప్రజలు మరోసారి గుర్తుచేసుకోవాలని కోరారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో 168 శాతం ఉన్న అప్పులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో 58 శాతానికి వచ్చాయన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పప్పుబెల్లంలా పంచి పెడుతున్నారని రాష్ట్రం దివాళా తీస్తుందని మరో శ్రీలంక అవుతుందని ఎద్దేవా చేసిన టీడీపీ నాయకులే, రానున్న ఎన్నికలలో ఏఒక్క హామీని తొలగించకుండా ఇంతకు మించి ఇస్తామని చెబుతున్నారని మండిపడ్డారు.

పేదలకు రూ.2.58లక్షల కోట్లు అందజేత

దేశచరిత్రలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల ద్వారా పేదలకు నేరుగా డీబీటి రూపంలో రూ.2.58లక్షల కోట్లను అందించిన ఘనచరిత్ర సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదని ఎమ్మెల్యే జగన్‌మోహనరావు పేర్కొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో వ్యవసాయం, పారిశ్రామిక, విద్య, వైద్యంతో పాటు అన్ని రంగాలు దేశంలో ఉన్నతస్థాయిలో ఉన్నాయని గుర్తు చేశారు. భివృద్ధి, సంక్షేమం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రానున్న ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చేసిన మంచిని చెప్పేందుకు సామాజిక సాధికార బస్సు యాత్ర అంటున్నారని వాస్తవానికి అన్ని వర్గాల ప్రజలకు జరిగిన మంచిని వివరించే సామాజిక సాధికార యాత్ర అని తెలిపారు. గత ప్రభుత్వాల మాదిరిగా ఏ ఒక్క వర్గానికో కొమ్ముకాయకుండా అన్ని వర్గాల సంక్షేమ సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. సచివాలయ భవనాలు, రైతు భరోసా కేంద్రాలు, ఇళ్ల స్థలాలు, ఇళ్లు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అభివృద్ధి కాదా అని ప్రతిపక్ష టీడీపీని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే పెద్దపెద్ద భవనాలు, మిద్దెలు కాదని పౌరుని కనీస అవసరాలు తీర్చడమే నిజమైన అభివృద్ధి అని ఆ దిశగానే జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని చెప్పారు. రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉందని చెప్పుకునే టీడీపీ అధినేత చంద్రబాబు చేయలేని అభివృద్ధి, పేదల సంక్షేమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో చేసి చూపించారని వివరించారు. ప్రభుత్వ సలహాదారు జూపూడి ప్రభాకరరావు, ఎమ్మెల్సీ మొండితోక అరుణకుమార్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, ఎంపీపీలు అరిగెల సుందరమ్మ, గుడేటి నాగమల్లేశ్వరి, మలక్ బషీర్, జడ్పీటీసీలు వేల్పుల ప్రశాంతి, అమర్లపూడి కీర్తి సౌజన్య, కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ షహనాజ్ బేగం, పరిటాల దివ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్లు దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, మంచాల చంద్రశేఖర్, నన్నపనేని నరసింహారావు, కందుల నాగేశ్వరరావు, ఆవుల రమేష్ బాబు, నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.15 కోట్లతో ఆలయ అభివృద్ధి



మాట్లాడుతున్న విప్ ఉదయభాను, పక్కన పెనమలూరు ఎమ్మెల్యే పార్థసారథి



సభకు హాజరైన నాయకులు, ప్రజలు

ప్రభుత్వవిప్ ఉదయభాను

పెనుగంచిప్రోలు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పెనుగంచిప్రోలు శ్రీతిరుపతమ్మవారి ఆలయాన్ని రూ.15కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖ ఆలయంగా వెలుగొందుతున్న స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఆలయ ఆవరణలో ఘనంగా జరిగింది. ముందుగా ఆలయ నూతన చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, పాలకవర్గసభ్యులను అందరికీ పరిచయం చేశారు. అనంతరం జరిగిన అభినందన సభలో విప్ ఉదయభాను మాట్లాడుతూ గతంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రూ.5కోట్లతో ఆలయం చుట్టూ బేడామండపం, రాజగోపురం నిర్మాణాలు చేపట్టామని గుర్తుచేశారు. వైఎస్ తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో తాను మరలా ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే రూ.15కోట్లతో భక్తులకు విశేష సౌకర్యాలు కల్పిస్తుండటం తనకు సంతోషంగా ఉందన్నారు. సమాజంలో అందరికీ అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో మొదటిసారి ఆలయ చైర్మన్ పదవిని బీసీ వర్గానికి ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఎవరికైనా బాధగా ఉంటే అర్థం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి కూడా అన్ని వర్గాలకు అన్ని పదవుల్లో అవకాశం కల్పిస్తున్నారని వివరించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా నూతన పాలకవర్గం పని చేయాలని సూచించారు. పెనమలూరు ఎమ్మెల్యే, మాజీమంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ అమ్మవారికి అందరూ భక్తులేనని, అందరికీ అవకాశాలు రావాలన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనామినేటెడ్ పదవుల్లో 50శాతం బడుగు, బలహీన వర్గాలకు కల్పించటంతోపాటు ఆలయ పాలకవర్గాల్లో ఒక నాయిబ్రాహ్మణుడికి అవకాశం కల్పించిన ఘనత తమ ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. మంత్రివర్గంలో సైతం 75శాతం పదవులు బడుగు, బలహీనవర్గాలకే కేటాయించారని గుర్తుచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో టీటీడీ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 3వేల ఆలయాలు నిర్మిస్తున్నట్లు వివరించారు. అంతకుముందు స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద ర్యాలీలో పాల్గొన్న ఉదయభాను, పార్థసారథిలను క్రేన్‌తో భారీ గజమాలతో సన్మానించారు. కార్యక్రమంలో పెనుగంచిప్రోలు, వత్సవాయి ఎంపీపీలు మార్కపూడి గాంధీ, కె.నాగమణి, జెడ్పీటీసీ సభ్యులు వూట్ల నాగమణి, ఏసుపోగు దేవమణి, జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణప్రసాద్, పూసల, మహిళా కార్పొరేషన్ డైరక్టర్లు చేని కుమారి, సంపత్ విజిత, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల పార్టీ అధ్యక్షులు కనకపూడి భాస్కరరావు, మండవ శ్రీనివాస్‌గౌడ్, గుత్తా శంకర రావు, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు వూట్ల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు కనగాల శ్రీనివాస రావు, గుంటుపల్లి వాసు, ఆలయ ఈవో కె రమేష్ నాయుడు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



విప్ ఉదయభాను, ఎమ్మెల్యే పార్థసారథిలకు గజమాలతో సత్కారం

విశ్రాంత ఉద్యోగుల సేవలు అభినందనీయం

జడ్జి శ్రావణి



క్యాలెండరును ఆవిష్కరిస్తున్న జడ్జి శ్రావణి, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని కార్యాలయం ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఏపి ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సేవలు ఆదర్శనీయమని జగ్గయ్యపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణి పేర్కొన్నారు. స్థానిక ఎస్ఎస్‌పీ గ్యారేజ్‌లో పెన్షనర్స్ డేను సంఘ అధ్యక్షుడు దారా వినోద్ బాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి శ్రావణి మాట్లాడుతూ సంఘ సేవా కార్యక్రమాలను కొనియాడారు. అనంతరం నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించి సంఘ సభ్యులందరికి అందజేశారు. 70ఏళ్లు నిండిన విశ్రాంత ఉద్యోగ సభ్యులందరినీ ఘనంగా సత్కరించారు. సంఘ గౌరవాధ్యక్షుడు ధరణికోట వెంకటరమణ, అధ్యక్షుడు దారా వినోద్ బాబు, కార్యదర్శి ఎస్.ఎ.ఘని, సంఘ ప్రతినిధులు ముత్యాలరావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, వేల్పుల నాగేశ్వరరావు, జంపాల నరసింహారావు, దారా విజయలక్ష్మి మాట్లాడుతూ పెన్షనర్స్ సంఘ అభివృద్ధి, చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మరియదాసు, బి.సత్యనారాయణ, కె.పూర్ణచంద్రరావు, ఎం.జీవరత్నం, వినయవాణి తదితరులు పాల్గొన్నారు.

మధుర స్వరాల కంఠశాల ఘంటసాల



ఘంటసాల చిత్రగీతాలను ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడకల్చరల్: మధుర స్వరాల కంఠశాల ఘంటసాల అని పద్మశ్రీ ఘంటశాల, వి.రామకృష్ణ సాంస్కృతిక సేవా సంస్థ(ఒంగోలు) పెండ్యాల సాయి మాష్టారు అన్నారు. పద్మశ్రీ ఘంటసాల, వీ రామకృష్ణ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాయకుడు ఘంటసాల 101వ జయంతి, సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన సాయి మాష్టారు మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయకుడు ఘంటసాల మాష్టారన్నారు. అక్కినేని నాగేశ్వరరావు లేని తెలుగు సినిమా పరిశ్రమను ఊహించలేమని ఇద్దరూ కృష్ణాజిల్లా వారు కావడం తెలుగు సినిమా పరిశ్రమ చేసుకున్న అదృష్టమన్నారు. అక్కినేని, ఘంటసాల కాంబినేషన్‌లో అనేక చిత్రాలు విజయవంతమయ్యాయని చెప్పారు. స్వరాంజలి కార్యక్రమంలో భాగంగా గాయనీ గాయకులు పెండ్యాల మాష్టారు, మువ్వా నాగేశ్వరరావు, బియ్యపు శ్రీను, రామయ్య, సంజీవ్, సౌజన్య సుహాసిని తదితరులు ఘంటసాల, రామకృష్ణ గానం చేసిన గీతాలను మధురంగా గానం చేశారు. నిర్వాహకులు ఘంటసాల, అక్కినేని, రామకృష్ణ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావుతో, పెద్ద సంఖ్యలో ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ధ్యానకేంద్రం ప్రారంభోత్సవంలో విప్ ఉదయభాను, గెంటేల వెంకటరమణ దంపతులు తదితరులు

జగ్గయ్యపేట అర్బన్: ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పేర్కొన్నారు. స్థానిక బుద్ధ విహార్ పార్కు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధ ధ్యానకేంద్రాన్ని ఎమ్మెల్యే ఉదయభాను, శ్రీగురుధాం వ్యవస్థాపకుడు గెంటేల వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో పిరమిడ్ రూపంలో ఉన్న గౌతమ బుద్ధ ధ్యానకేంద్రాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. నేటి ఆధునిక యాంత్రిక జీవనంలో మానసిక ఒత్తిడితో ఉన్నవారికి ధ్యానం ద్వారా ఉపశమనం లభిస్తుందన్నారు. జగ్గయ్యపేట, నందిగామ పరిసర ప్రాంతాల్లో కూడా పిరమిడ్ రూపంలో ఉన్న ధ్యానకేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అదేవిధంగా రూ.5కోట్లతో ఊరచెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పచ్చని చెట్లు తదితర హంగులతో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మున్సిపల్ వైస్‌చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, తన్నీరు నాగేంద్ర, న్యాయవాది సత్య శ్రీనివాస్, కొత్తా పురుషోత్తం, చారుగుండ్ల కొండ, ధ్యానకేంద్రం ప్రతినిధులు పాల్గొన్నారు.

కళాకారుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలి

విజయవాడకల్చరల్: కళాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపకుడు గుమ్మడి విజయకుమార్ అన్నారు. శుభకరీ నాటక కళాపరిషత్, డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి, మంగమ్మతల్లి కళా నాట్యమండలి, స్నేహలయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, సీనియర్ మేకప్‌మెన్ బాటాన తాతినాయుడుకు స్వర్ణకంకణ బహూకరణ మహోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన కళాకారుడు తాతినాయుడని అభివర్ణించారు. డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ మాట్లాడుతూ నాటక, సినిమా రంగానికి మేకప్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి కళాకారుల్లోని ప్రతిభను గుర్తించాలని సూచించారు. నిర్వాహకులు తాతినాయుడుకు స్వర్ణకంకణం బహూకరించారు. అనంతరం దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా యల్లా జోస్యుల అనురాధ, మద్దాలి సాయిచంద్రిక బృందం సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించింది. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, రంగస్థల నటుడు నాట్యాచార్యులు భగవతుల వెంకట్రామశర్మ, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.